
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 20 । మార్చి । 2024



టన్ను చీనీ రూ.22,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22,500 పలికాయి. మార్కెట్‌కు 417 టన్నుల సరుకు వచ్చింది.



ఏసీబీ వలలో సబ్ రిజిస్ట్రార్

మడకశిర సబ్‌రిజిస్ట్రార్ దామోదర్‌రెడ్డి ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. 8లో

రంజాన్ వేళలు

బుధవారం	గురువారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.34	సెహరీ : 5.09



న్యూస్‌రీల్

ఎన్నికల నియమావళి పక్కాగా అమలు చేయాలి



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ అభిషేక్‌కుమార్ తదితరులు

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల నియమావళిని జిల్లాలో పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా మంగళవారం సాయంత్రం విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాజకీయ ప్రకటనల బోర్డులు, హోర్డింగ్‌లు, పోస్టర్లు ,బ్యానర్లు తొలగించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ కొండయ్య, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వభరత్ తదితరులతో కలిసి జిల్లా అధికారులతో వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలన్నారు. నూతన పనులకు, ప్రారంభోత్సవాలకు అనుమతులు ఇవ్వొద్దన్నారు. బార్డర్ చెక్ పోస్టుల్లో వెబ్ క్యాస్టింగ్ ద్వారా పర్యవేక్షించాలని, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలన్నారు. ఎలక్ట్రానిక్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టంను విస్తృతంగా వినియోగించాలన్నార. సీవిజిల్ ద్వారా అందే ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఇప్పటికే పీఓలు, ఏపీఓలకు శిక్షణ పూర్తి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల అధికారులు పుట్టపర్తి భాగ్యరేఖ, మడకశిర గౌరీశంకర్, కదిరి సన్నీ వంశీకృష్ణ, ధర్మవరం వెంకట శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందీ పరీక్షకు 611 మంది గైర్హాజరు



పరీక్ష అనంతరం కొత్తచెరువు హైస్కూల్ కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

కొత్తచెరువు: పదో తరగతి పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. రెండోరోజు మంగళవారం 115 కేంద్రాల్లో జరిగిన హిందీ పరీక్షకు 22,420 మంది విద్యార్థులకు గాను 21,809 మంది హాజరయ్యారు. 611 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ మీనాక్షి, పదో తరగతి పరీక్షల నిర్వహణ అధికారి లాజర్ తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఫర్నీచర్ తదితర వసతులన్నీ కల్పించారు. అలాగే కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయించారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన డీఈఓ..

కదిరి అర్బన్: స్థానిక వీవర్స్ కాలనీలోని మున్సిపల్ ఉన్నత పాఠశాల, కుమ్మరవాండ్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను డీఈఓ మీనాక్షి మంగళవారం పరిశీలించారు. అలాగే పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల కేంద్రంలో జరుగుతున్న సార్వత్రిక విద్యా పీఠం పది, ఇంటర్ పరీక్షలనూ ఆమె పరిశీలించారు. మొత్తం 2,172 మంది విద్యార్థులకు గాను 2,114 మంది హాజరయ్యారని, 58 మంది గైర్హాజయ్యారని ఆమె వెల్లడించారు.

రైతు వెన్నువిరిచి.. కార్మికుడిని పస్తుపెట్టి!

ది నిజాం షుగర్స్... పరిగి మండలం సుధానగర్ వద్ద 135 ఎకరాల్లో విస్తరించిన పరిశ్రమ. 600 మంది కార్మికులు, 1,250 టీడీసీ సామర్థ్యం... ఏటా మూడు నెలల నిరంతరాయ క్రషింగ్.. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 10 నియోజకవర్గాల్లోని 10 వేల ఎకరాల్లో చెరకు పండించే రైతులకు ఆదరువు. ఓ వెలుగు వెలుగుతూ ఎందరో జీవితాల్లో సంతోషాలు నింపిన పరిశ్రమ.. చంద్రబాబు హయాంలో కుదేలైంది. నష్టాలు సాకుగా చూపి ఫ్యాక్టరీని ప్రైవేటు సంస్థకు విక్రయించగా.. కార్మికులు రోడ్డున పడ్డారు. చెరకు పండించే రైతు బతుకు చేదెక్కిపోయింది. పరిశ్రమలు స్థాపించాం.. ఉపాధి కల్పించామని పదేపదే చెబుతున్న బాబు.. నిజాం షుగర్స్ కథ కూడా చెప్పాలని కార్మికులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.



మూతపడిన నిజాం షుగర్స్ కర్మాగారం

- టీడీపీ హయాంలో నిజాం షుగర్స్‌కు తాళం
- నష్టాలు సాకుగా చూపి ప్రైవేటు కంపెనీకి ధారాదత్తం
- యంత్రాలు తరలించుకున్న ప్రైవేటు కంపెనీ
- షుగర్ ఫ్యాక్టరీ స్థలాలు రియల్ ఎస్టేట్ కంపెనీకి విక్రయం
- ఉపాధి కోల్పోయి రోడ్డున పడిన కార్మికులు
- కార్మికులకు కొత్త జీవితం ఇచ్చేందుకు వైఎస్సార్ సీపీ సర్కార్ కృషి
- గార్మెంట్స్ పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి కల్పిస్తున్న వైనం



నిజాం షుగర్ కర్మాగారం స్థానంలో రియల్టర్లు ఏర్పాటు చేసిన ప్రవేశ ద్వారం

హిందూపురం అర్బన్/పరిగి: హిందూపురం నిజాం షుగర్ ఫ్యాక్టరీ. ఉమ్మడి అనంతపురం జిల్లా రైతుల కల్ప తరువు. 1972–1978 మధ్య జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అప్పటి ఎమ్మెల్యే గాజుల సోమశేఖర్ కృషితో పరిగి మండలం సుధానగర్ వద్ద ఫ్యాక్టరీ ఏర్పాటైంది. సీజన్‌లో మూడు నెలలూ 24 గంటలూ లక్ష టన్నుల చెరకు క్రషింగ్ జరిగేది. అలాంటి కర్మాగారం నాడు (1997–98 మధ్య కాలంలో) చంద్రబాబు విషపు కోరల్లో చిక్కి కనుమరుగైంది.

రైతుల పొట్టకొట్టిన టీడీపీ..

నిజాం షుగర్ ఫ్యాక్టరీలో 1976–78 మధ్య క్రషింగ్ ప్రారంభించగా, నిరంతరాయంగా నడుస్తూ వచ్చింది. ఈ ఫ్యాక్టరీ కోసం ఉమ్మడి అనంతపురం జిల్లాలోని హిందూపురం, మడకశిర, పెనుకొండ, కదిరి, ధర్మవరం, పుట్టపర్తి, రాప్తాడు, శింగనమల, రాయదుర్గం నియోజకవర్గాల్లోని 500 గ్రామాల్లో 20 వేల మంది రైతులు దాదాపు 10 వేల ఎకరాల్లో చెరకు సాగు చేసేవారు. యాజమాన్యం నుంచి కూడా సహకారం బాగుంటంతో రైతులు ఉత్సాహంగా పంట పండించేవారు. అలాంటి ఫ్యాక్టరీపై కన్నేసిన చంద్రబాబు... నష్టాలు చూపించి కర్ణాటక రాష్ట్రం బెళగావికి చెందిన శ్రీ రేణుకా షుగర్స్ లిమిటెడ్ కంపెనీకి కేవలం రూ.5 కోట్లకు విక్రయించారు. అప్పట్లోనే ఇన్‌సైడర్ ట్రేడింగ్ రూ.20 కోట్ల వరకు జరిగినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి.

చంద్రబాబుదే ఆ పాపం..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1995–2003 మధ్య కాలంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు హిందూపురం, జహీరాబాద్, మిర్యాలగూడ, బొబ్బిలి ప్రాంతాల్లో నిజాం షుగర్స్ కర్మాగారాలను ప్రైవేటు కంపెనీలకు విక్రయించారు. అందులో భాగంగా 1998లో హిందూపురం నిజాం షుగర్స్‌ను బెళగావికి చెందిన శ్రీరేణుకా షుగర్స్ కంపెనీకి అమ్మేశారు. 135 ఎకరాల భూమితో పాటు యూనిట్ భవనాలు, ప్లాంట్, యంత్రాలను రేణుకా షుగర్స్ స్వాధీనం చేసుకుంది. కంపెనీలో పనిచేసే కార్మికులకు ఉపాధి చూపిస్తామన్న సదరు కంపెనీ.. ఆ తర్వాత చేతులెత్తేసింది. 1999 సంవత్సరంలో సుధానగర్ ఫ్యాక్టరీలోని యంత్రాలను బెళగావిలోని శ్రీరేణుకా షుగర్స్ ప్లాంట్‌కు తరలించింది. ఆ సమయంలో రైతులు ఆందోళనకు దిగగా, అప్పటి టీడీపీ సర్కార్ ప్రైవేటు కంపెనీకి మద్దతుగా పోలీసులపై ఒత్తిళ్లు తెచ్చి రైతులపై ఉక్కుపాదం మోపింది. దీంతో ఈ కర్మాగారంలో పనిచేసే 473 మంది పర్మినెంట్ కార్మికులు స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. మరికొందరు బెళగావి ప్లాంట్‌కు వెళ్లారు. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా షుగర్ ఫ్యాక్టరీపై ఆధారపడిన 10 వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. అయినా అప్పటి టీడీపీ ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోలేదు. దీంతో కొందరు కార్మికులు, ఫ్యాక్టరీకి అతితక్కువకు భూములిచ్చిన రైతులు కోర్టులకు వెళ్లారు. ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు.

ఫ్యాక్టరీ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం..

స్థానికంగా పరిశ్రమ ఏర్పాటైతే తమ పిల్లలకు ఉపాధి దక్కుతుందన్న ఆశతో అప్పట్లో రైతులు చాలా తక్కువ ధరకు నిజాం షుగర్స్‌కు 155 ఎకరాల భూమిలిచ్చారు. అయితే నిజాం షుగర్స్ కర్మాగారాన్ని దక్కించుకున్న శ్రీరేణుకా షుగర్స్ యాజమాన్యం ఆ తర్వాత ఫ్యాక్టరీ భూములను రస్సాయి ప్రాపర్టీస్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు విక్రయించింది. ఇప్పుడా భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లి ప్లాట్లుగా మారాయి.

టెక్స్‌టైల్స్ రంగంలో ఉపాధికి మార్గం



పరిగి వద్ద ఏర్పాటు చేసిన గార్మెంట్స్ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులు

నిజాం షుగర్స్ కర్మాగారం మూత పడిన తర్వాత కార్మికులకు, నిరుద్యోగులకు స్థానికంగా ఉపాధి లేకుండా పోయింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక యువతకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం టెక్స్‌టైల్స్ రంగంపై దృష్టి సారించింది. హిందూపురం, పరిగి, చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లో గార్మెంట్స్ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. దీంతో హిందూపురం తూమకుంట పారిశ్రామికవాడల్లో 12 వేల మందికి, పరిగి, గోరంట్ల, చిలమత్తూరు మండలం కోడూరు వద్ద ఒక్కో పరిశ్రమలో 1,000 నుంచి 1,200 మంది పని చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

కోర్టుల చుట్టూ తిరుగుతున్నాం



నిజాం షుగర్స్‌లో పనిచేసే సమయంలో మా కుటుంబం ఆనందంగా ఉండేది. కానీ 1998లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఫ్యాక్టరీని రేణుకా షుగర్స్‌కు విక్రయించడంతో కష్టాలు మొదలయ్యాయి. కర్మాగారం మూసివేసిన తర్వాత మా భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. దీంతో న్యాయం కోసం కోర్టుకు వెళ్లాం. ఇప్పటికీ కోర్టు చుట్టూ తిరుగుతున్నాం. – లక్ష్మయ్య, షుగర్ ఫ్యాక్టరీ కార్మికుడు

చంద్రబాబు వచ్చాకే కంపెనీ మూత



1996–97 మధ్య కాలంలో లేపాక్షి ప్రాంతంలో చెరకు ఎక్కువగా పండించే వాళ్లం. మా కుటుంబమే 1,000 టన్నులకుపైగా చెరకును నిజాం షుగర్ ఫ్యాక్టరీకి సరఫరా చేసేది. 1998లో చంద్రబాబు అధికారంలోకి వచ్చాక నష్టాలు చూపి నిజాం షుగర్స్‌ను ప్రైవేటు కంపెనీకి విక్రయించారు. అప్పట్లో ఆందోళన చేసినా ఫలితం లేకుండా పోయింది. రైతుల నోట్లో మట్టికొట్టారు. – జయరామిరెడ్డి, రైతు. లేపాక్షి

టైలరింగ్‌తో ఉపాధి



మా ప్రాంతంలో గతంలో ఎలాంటి పరిశ్రమలు లేక చాలా మంది వలస వెళ్లారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఇక్కడ గార్మెంట్స్ పరిశ్రమలు నెలకొల్పారు. దీంతో నాలాంటి ఎంతో మంది టైలరింగ్ పని చేస్తూ ఉపాధి పొందుతున్నాం. దీనికి తోడు జగనన్న మహిళలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు తోడవడంతో గతం కంటే మంచి జీవనం గడుపుతున్నాం. – రామాంజినమ్మ, గార్మెంట్స్ కార్మికురాలు, పరిగి

ధర్మయుద్ధంలో వైఎస్సార్ సీపీదే విజయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, చిత్రంలో మక్బూల్ అహ్మద్, పూల శ్రీనివాసరెడ్డి

రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

కదిరి టౌన్: ప్రస్తుతం జరుగుతున్న ధర్మయుద్ధంలో పేదల పక్షాన నిలిచిన వైఎస్సార్ సీపీదే విజయమని ప్రభుత్వ చీఫ్ విప్, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. కౌరవులు ఎంతమంది ఏకమైనా ఏమయ్యిందో చరిత్ర తిరగేస్తే తెలుస్తుందన్నారు. అందువల్ల ఎన్నిపార్టీలు..ఎంతమంది ఏకమైనా జగన్ విజయాన్ని అడ్డుకోలేరన్నారు. మంగళవారం కదిరికి వచ్చిన ఆయన, వైఎస్సార్ సీపీ కదిరి నియోజకవర్గ అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయని, అందుకే వారంతా వైఎస్సార్ సీపీకే మద్దతు తెలుపుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కదిరిలో మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఐదేళ్ల క్రితం ప్రధాని నరేంద్ర మోదీని టెర్రరిస్ట్‌గా అభివర్ణించిన చంద్రబాబు.. నేడు తన స్వార్థ రాజకీయం కోసం అదే మోదీతో జతకట్టాడన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవం అంటూ ఎన్టీఆర్ స్థాపించిన పార్టీని చంద్రబాబు ఢిల్లీలో అమిత్‌షా ఇంటి గేటు ముందు తాకట్టు పెట్టాడన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, పార్టీ మాజీ సమన్వయకర్త ఎస్ఎండి ఇస్మాయిల్, నాయకులు పరికి సాధిక్ బాషా, సాదత్ అలీఖాన్, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హరహర మహాదేవ

- నేత్రపర్వం.. గవిమఠ చంద్రమౌళీశ్వరుడి బ్రహ్మరథోత్సవం
- స్వామి దర్శనంతో పులకించిన భక్తజనం



అశేష భక్తజనం నడుమ సాగుతున్న గవిమఠం చంద్రమౌళేశ్వరస్వామి బ్రహ్మ రథోత్సవం (ఇన్‌సెట్) చంద్రమౌళేశ్వరస్వామి ఉత్సవమూర్తిని ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

ఉరవకొండ: హరహర మహాదేవ శంభోశంకర అంటూ భక్తులు చేసిన నామస్మరణతో ఉరవకొండ మార్మోగింది. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 770 ఉపమఠాలు కల్గిన అతిపెద్ద ధార్మిక మఠంగా గుర్తింపు పొందిన ఉరవకొండ గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం మంగళవారం నేత్రపర్వంగా సాగింది. మఠం పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి, ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి, మఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ, ఏజెంట్ రాజన్నగౌడ్ ఆధ్వర్యంలో ఉదయం చంద్రమౌళీశ్వరస్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తిని రథం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. మూడు ప్రదక్షిణలు చేయించి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం ఉత్సమూర్తులను రథంలో కొలువుతీర్చి ఉత్సవాన్ని ప్రారంభించారు. అశేష భక్తజనం నడుమ రథోత్సవం ఆద్యంతం కనులపండువగా సాగింది. భక్తులు పూలు, పండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి రథోత్సవంలో పాల్గొన్నారు. గవిమఠం పీఠాధిపతులు, ఉత్తరాధికారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు వై.మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, సర్పంచ్ లలితమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప తదితరులు పాల్గొన్నారు. ఉత్సవంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, సీఐలు సురేష్‌బాబు, ప్రవీణ్, ఎస్ఐ రాఘవేంద్రప్పలు పోలీసు బందోబస్తు చేపట్టారు.



బ్రహ్మ రథోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి, నాయకులు

ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- నేడు స్వామివారి కల్యాణం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు మంగళవారం అంకురార్పణ చేశారు. మంగళవాయిద్యాల మధ్య నారసింహుడు రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఆలయానికి నైరుతి దిశలో ఉన్న మండపాన్ని చేరుకున్నారు. అర్చక పండితులు నిర్ణీత ప్రదేశంలో 'భూమిపూజ'తో పుట్టమన్ను సేకరించి, ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. యాగశాలలో ఆ మట్టితో నింపిన 9 పాలిక(కుండ)ల్లో నవ ధాన్యాలతో అంకురార్పణ చేశారు. ఈ నవధాన్యాలు దిన దినాభివృద్ధి చెందేలా అర్చకులు బ్రహ్మోత్సవాలు పూర్తయ్యే వరకూ రోజూ నీరు పోసి పచ్చగా మొలకెత్తేలా చూస్తారు. ఏ ధాన్యం బాగా మొలకెత్తుతుందో ఆ పంట ఈ ఏడాది బాగా పండుతుందని భక్తుల నమ్మకం. నారసింహుడు ఈ పక్షం రోజుల పాటు యాగశాల నుంచే భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

ఆరని అగ్నిహోత్రం

బ్రహ్మోత్సవాల సందర్భంగా యాగశాలలో అంకురార్పణ తర్వాత అగ్నిహోత్రం వెలిగించారు. బ్రహ్మోత్సవాలు పూర్తయ్యేవరకూ ఈ అగ్నిహోత్రం ఆరకుండా అర్చకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటారు. ఉత్సవాలను నలుదిక్కులా చాటేందుకు బుధవారం (నేడు) ఉదయం ఆలయ ప్రాంగణంలో ఉన్న ప్రధాన ధ్వజ స్తంభానికి గరుడ దండాన్ని ధ్వజారోహణం చేస్తారు. దీన్ని బ్రహ్మోత్సవాలు పూర్తయ్యేరోజు అంటే తీర్థవాది నాడు శ్రీవారి చక్రస్నానం అనంతరం అవరోహణం చేసి ఉత్సవాలకు ముగింపు పలుకుతారు. శ్రీవారి అంకురార్పణ కార్యక్రమానికి ఉభయదారులుగా బెంగుళూరుకు చెందిన కేఎస్ నాగేశ్వర రావు కుటుంబీకులు వ్యవహరించినట్లు ఆలయ సహాయ కమిషనర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

నేడు ఖాద్రీశుని కల్యాణం

లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధానమైన శ్రీవారి కల్యాణోత్సవం బుధవారం రాత్రి 9.30 గంటలకు వైభవంగా జరగనుంది. ఇందుకోసం ఆలయ అధికారులు, అర్చకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున కలెక్టర్ అరుణ్‌బాబు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఇప్పటికే పట్టణానికి నలువైపులా స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని, పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఇక శ్రీవారి కల్యాణోత్సవాన్ని జరిపించేందుకు టీటీడీ తరఫున కొందరు అర్చక పండితులు హాజరు కానున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు.



యాగశాలలో కొలువు దీరిన శ్రీవారు



విద్యుద్దీపాలతో మెరిసిపోతున్న ప్రధాన రాజగోపురం



కదిరి పట్టణంలో ఏర్పాటు చేసిన స్వాగత తోరణం



విద్యుద్దీపాలంకరణలో నృసింహాలయం

క్లుప్తంగా

క్వింటా ఎండుమిర్చి రూ.22 వేలు



'పురం' మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్: ఎండు మిర్చి కొనుగోళ్లతో హిందూపురం వ్యవసాయ మార్కెట్ కళకళలాడుతోంది. మంగళవారం ఏకంగా 175 క్వింటాళ్ల ఎండుమిర్చి రాగా, అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలం వేశారు. ఇందులో క్వింటా గరిష్టంగా రూ. 22 వేలు, కనిష్టంగా రూ.9 వేలు, సగటున రూ.13,500 ప్రకారం క్రయవిక్రయాలు సాగినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు.

రెండు కార్లు ఢీ



ఘటనాస్థలంలో బోల్తా పడిన ఓ కారు

రొళ్ల: రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... అగళి మండలం మధూడి గ్రామానికి చెందిన సురేష్... రొళ్ల బస్టాండ్ ఆవరణలో ఫ్రూట్ జ్యూస్ దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మధూడి నుంచి కారులో బయలుదేరిన ఆయన రొళ్ల సమీపంలో జాతీయ రహదారిపై మలుపు వద్ద వాహనాన్ని తిప్పుకుంటుండగా అమరాపురం గ్రామానికి చెందిన వేణు, తన కుటుంబసభ్యులతో కలసి కారులో మడకశిర వైపు వేగంగా ప్రయాణిస్తూ ఢీకొన్నాడు. ఘటనలో సురేష్ నడుపుతున్న మారుతీ సుజుకి కారు రోడ్డు పక్కనే ఉన్న పల్లంలోకి బోల్తాపడింది. తీవ్రంగా గాయపడిన సురేష్, వేణును స్థానికులు వెంటనే రొళ్ల సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

కేజీబీవీల్లో దరఖాస్తుల స్వీకరణ

కొత్తచెరువు: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) 2024–25 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి, 11వ తరగతుల్లో ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రాష్ట్ర పథక సంచాలకులు శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 12 నుంచి ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 180004258 599 టోల్ ఫ్రీ నంబరులో సంప్రదించాలన్నారు.

వెన్నుపోటు.. రగిలిపోతూ

- అధినేత తీరుపై నిమ్మల, బీకే వర్గాల గుర్రు
- వాడుకుని వదిలేశారంటూ కేడర్ వద్ద ఆవేదన
- కదిరిలో మైనార్టీకి సీటివ్వకుండా మోసం చేశారంటున్న చాంద్‌బాషా వర్గం
- కళ్యాణదుర్గంలో బాబు సొంత సామాజిక వర్గంలోనే అసమ్మతి జ్వాలలు
- అనంతపురం, గుంతకల్లు సీట్లపై అందుకే తాత్సారం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'ఎవరైనా ఒకటే.. వెన్నుపోటే' అంటూ తనకు వెన్నతో పెట్టిన విద్యను చంద్రబాబు ప్రదర్శించారు. బూటకపు హామీలతో అన్ని వర్గాలనూ మోసం చేసిన ఆయన సొంత పార్టీ నేతలనూ వంచించారు. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రేగిన మంటలు చల్లారడం లేదు. 20 రోజుల క్రితం టికెట్లు ప్రకటించినా రోజూ ఏదో ఒక నియోజక వర్గంలో అసమ్మతి సెగలు ఎగుస్తూనే ఉన్నాయి. ఈ పరిణామాలు టికెట్లు దక్కించుకున్న ఆ పార్టీ అభ్యర్థులను కలవరపెడుతున్నాయి.

బీసీ నేతల్లో పెల్లుబుకుతున్న ఆగ్రహం

అనంతపురం జిల్లాలో బీసీ వర్గాలు ఎక్కువగా ఉన్నాయి. అలాంటి వారినే బాబు తొక్కేశారు. చేనేత వర్గానికి చెందిన సీనియర్ నేత, ఎంపీగా, మంత్రిగా సేవలందించిన నిమ్మల కిష్టప్పను వాడుకుని వదిలేశారు. దీంతో నిమ్మల లోలోనే కుమిలిపోతున్నారు. పెనుకొండ నియోజకవర్గానికి చెందిన మరో సీనియర్ నేత బీకే పార్థసారథి వర్గం కూడా అంతే స్థాయిలో అసంతృప్తిగా ఉంది. కురుబ సామాజిక వర్గంలో మంచి పట్టున్న పార్థసారథిని ఈ దఫా చంద్రబాబు విస్మరించారంటూ పార్థ వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఇక పుట్టపర్తిలో వడ్డెర్లకు టికెట్ ఇస్తామని మోసం చేశారని ఏకంగా చంద్రబాబు ఇంటివద్దే పలువురు ధర్నాకు దిగిన విషయం తెలిసిందే. వడ్డెర సామాజిక వర్గానికి చెందిన డీఎస్పీ వేణుగోపాల్‌ను పోటీకి సిద్ధంగా ఉండాలని చెప్పి చివరకు పల్లె రఘునాథరెడ్డి కోడలికి టికెట్ ఇవ్వడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. పల్లె దగ్గర రూ.కోట్లు తీసుకుని టికెట్ ఇచ్చారని ఆరోపిస్తున్నారు.

మైనార్టీలను ముంచేశారు

చంద్రబాబు తమనూ వంచించారని ముస్లిం మైనార్టీ నేతలు వాపోతున్నారు. 2014లో వైఎస్సార్ సీపీ తరఫున కదిరి ఎమ్మెల్యేగా గెలిచి తర్వాత టీడీపీలోకి వెళ్లిన చాంద్‌బాషాకు ఈ దఫా మొండి చేయి చూపారు. నకిలీ డీడీల కేసులో శిక్ష పడిన కందికుంట ప్రసాద్ కుటుంబానికి టికెట్ ఇవ్వడంపై చాంద్ వర్గీయులు మండిపడుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒక్క మైనార్టీకి కూడా సీటు ఇవ్వకపోవడంపై రగిలిపోతున్నారు. ఇక అనంతపురం అర్బన్ అసెంబ్లీ టికెట్ జనసేనకు కేటాయించి, బలిజ సామాజికవర్గం అభ్యర్థిని రంగంలోకి దింపుతామని ఆశ చూపి, నేడు మళ్లీ తన సామాజిక వర్గం వారినే నిలబెట్టేందుకు ప్రయత్నిస్తుండడంపై ఆయా వర్గాల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది.

సొంతవారైనా అంతే..

చివరకు సొంత సామాజిక వర్గం నేతలు కూడా బాబును దుమ్మెత్తి పోస్తున్నారు. కళ్యాణదుర్గం టికెట్ కోసం ఉన్నం హనుమంతరాయ చౌదరి, ఉమామహేశ్వర నాయుడు పోటీ పడ్డారు. చివరకు ఇద్దరిలో ఎవరికి సీటు ఇచ్చినా కలసి పని చేస్తామని ప్రకటించారు. కానీ చంద్రబాబు బడా కాంట్రాక్టర్ అమిలినేని సురేంద్రను తెరమీదకు తెచ్చారు. దీన్ని ఉన్నం, ఉమా జీర్ణించుకోలేకపోతున్నారు. ఇక గుంతకల్లు టికెట్ గుమ్మనూరు జయరాముకు ఇస్తే ఇంకెంత అసమ్మతి మొదలవుతుందోనని ఆ సీటుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. అనంతపురం అర్బన్ సీటులో కూడా అసమ్మతుల బెడద తప్పించుకునేందుకు ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు.

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం



సమావేశంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న దళితులు



ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, ఉషశ్రీచరణ్‌లను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

- చంద్రబాబువి మోసపూరిత హామీలు
- ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మరాదు
- వైఎస్సార్‌సీపీని మరోమారు ఆశీర్వదించండి
- ఆత్మీయ సమావేశంలో మంత్రి ఉషశ్రీచరణ్

గోరంట్ల: వైఎస్సార్‌సీపీ పాలనలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సామాజిక న్యాయం సాధ్యమవుతుందని మంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. జగన్ హయాంలోనే బడుగులకు చట్టసభలు, నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానాలు లభించాయని ఎంపీ అభ్యర్థి శాంతమ్మ అన్నారు. గోరంట్ల మండలం గుమ్మయ్యగారిపల్లి సమీపంలోని ఓ ఫంక్షన్ హాలులో మంగళవారం పెనుకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల దళితులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ప్రభుత్వ విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని, నాడు– నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ సంస్థలకు దీటుగా తీర్చిదిద్దారని, పేదలకు ఆంగ్ల మాధ్యమంలో బోధన అమలు చేశారని వివరించారు. అమ్మ ఒడి పథకం అమలుతో ఖజానా దివాళా తీస్తుందని, రాష్ట్రం మరో శ్రీలంకగా మారుతుందని ప్రతిపక్ష నేత చంద్రబాబు విమర్శలు చేశారన్నారు. ఎన్నికల వేళ మాట మార్చి ఒక కుటుంబంలో ముగ్గురు పిల్లల వరకు అమ్మ ఒడిలాంటి పథకం అమలు చేస్తామని హామీలు గుప్పిస్తున్నారన్నారు. గతంలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయని చంద్రబాబు.. ఇప్పుడు మరిన్ని హామీలతో మభ్య పెట్టేందుకు వస్తున్నారని, ప్రజలెవరూ నమ్మవద్దని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. హిందూపురం ఎంపీ అభ్యర్థి శాంతమ్మ మాట్లాడుతూ ఇప్పటి వరకు అన్ని రాజకీయ పార్టీలూ ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను వైఎస్ జగన్ గుర్తించి ఆత్మగౌరవం పెంచారన్నారు. రాజకీయ, చట్టసభలు, నామినేటెడ్ పదవుల్లో స్థానం కల్పించారన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కంబాలప్ప, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, ఎస్సీ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఏసీబీ వలలో మడకశిర సబ్ రిజిస్ట్రార్

మడకశిర: స్థానిక సబ్ రిజిస్ట్రార్ దామోదర్ అలియాస్ దామోదర్‌రెడ్డి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలలో చిక్కారు. అసైన్డ్ భూమి రిజిస్ట్రేషన్ కోసం రూ.2.50 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి తెలిపిన వివరాల మేరకు.. మడకశిర మండలం గంతలపల్లికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి హనుమంతరెడ్డి 6.36 ఎకరాల అసైన్డ్ భూమిని రిజిస్టర్ చేయించుకోవడానికి కొన్ని రోజుల క్రితం సబ్ రిజిస్ట్రారు దామోదర్‌ను సంప్రదించాడు. ఇందుకు సబ్ రిజిస్ట్రార్ భారీమొత్తంలో డబ్బు డిమాండ్ చేశారు. దీంతో అతను డాక్యుమెంటు రైటర్ షమీవుల్లా ద్వారా సంప్రదింపులు జరిపి రూ.2.50 లక్షలు ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. కానీ ఈ మొత్తమూ చెల్లించడం ఇష్టం లేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారు వల పన్ని పట్టుకోవడానికి పథకం రూపొందించారు. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి ఏడు గంటల సమయంలో బాధితుడు రూ.2.50 లక్షల నగదు డాక్యుమెంట్ రైటర్ చేతికి ఇచ్చాడు. అతను తీసుకెళ్లి సబ్‌రిజిస్ట్రారుకు అందజేస్తుండగా..ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. సబ్ రిజిస్ట్రార్‌తో పాటు డాక్యుమెంటు రైటర్‌ను అరెస్ట్ చేశారు. అలాగే రాత్రి తొమ్మిదిన్నర గంటల వరకు కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. నిందితులను బుధవారం ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి తెలిపారు.



ఏసీబీ అధికారులకు పట్టుబడిన సబ్ రిజిస్ట్రార్ దామోదర్, డాక్యుమెంట్ రైటర్ షమీవుల్లా..స్వాధీనం చేసుకున్న నగదు

పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య



విజయ్ (ఫైల్)

తాడిమర్రి: హిందీ సరిగా రాదని పరీక్షకు వెళ్లని పదో తరగతి విద్యార్థి ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు... నార్సింపల్లికి చెందిన గోగుల గంగాధర, కుమారి దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. పెద్ద కుమారుడు విజయ్ (15) బత్తలపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 18 నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు పరీక్ష రాశాడు. రెండో రోజు మంగళవారం హిందీ పరీక్ష రాయాల్సి ఉంది. అయితే తనకు హిందీ సరిగా రాదని పరీక్షకు వెళ్లకుండా ఆగిపోయాడు. వచ్చిన మేరకు రాసిరా అని తండ్రి చెప్పాడు. అనంతరం తల్లి పనికి వెళ్లగా.. తండ్రి అలాబయటకు వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో బాత్‌రూంలోకి వెళ్లిన విజయ్ కిటికీకి చీరతో ఉరివేసుకున్నాడు. కాసేపటి తర్వాత ఇంటికి చేరుకున్న గంగాధరకు కుమారుడు కనిపించలేదు. బాత్‌రూంలోకి వెళ్లి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే బంధువుల సాయంతో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అయినా ఫలితం లేకపోయింది. పరిస్థితి విషమించి సాయంత్రం నాలుగు గంటల సమయంలో విజయ్ మృతి చెందాడు. ఎంతపని చేశావయ్యా అంటూ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నాగస్వామి గ్రామానికి వెళ్లి సంఘటనపై విచారణ చేసి.. కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న అంబులెన్స్



నుజ్జునుజ్జయిన అంబులెన్స్



దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు వెనుక భాగం

- ఇద్దరి దుర్మరణం
- మృతులు తాడిపత్రి వాసులు

చెన్నేకొత్తపల్లి: ఇంటి యజమానిని కోల్పోయి పుట్టెడు దుఃఖంతో ఉన్న వారు అంబులెన్స్‌లో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువస్తూ మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. అంబులెన్స్ వాహనం ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వేగంగా ఢీ కొనగా... డ్రైవర్ పక్కన కూర్చున్న ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. ఈ ఘటనతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. ఈ ఘటన చెన్నేకొత్తపల్లి మండలం ఎన్‌ఎస్ గేటు సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాడిపత్రికి చెందిన షెక్షావలి (70) అనారోగ్యంతో బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. అదే రోజు రాత్రి మృతదేహాన్ని తీసుకుని ఆయన భార్య షకీల (62), కుమార్తె రిజ్వానా, కుమారుడు హాజీవలి, అల్లుడు గౌస్‌మహమ్మద్ (32) ప్రైవేటు అంబులెన్స్‌లో స్వస్థలానికి బయల్దేరారు. ఎన్‌ఎస్ గేట్ సమీపంలోని జాతీయ రహదారిపైకి చేరుకోగానే అంబులెన్స్ వేగాన్ని నియంత్రించలేని డ్రైవర్ స్టీరింగ్‌పై అదుపుతప్పి బెంగళూరు నుంచి తాడిపత్రి వెళ్తున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొంది. అంబులెన్స్ ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. ఇరుక్కుపోయిన అంబులెన్స్‌ను జేసీబీ సాయంతో బయటకు తీశారు. అంబులెన్స్‌లో డ్రైవర్ పక్కన కూర్చున్న షకీల అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవర్ సహా మిగిలిన వారు గాయపడ్డారు. సమాచారం అందుకున్న చెన్నేకొత్తపల్లి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. జేసీబీని రప్పించి అంబులెన్స్‌ను బయటకు తీయించారు. అందులోని క్షతగ్రాతులను మరొక అంబులెన్స్ ద్వారా అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అల్లుడు గౌస్‌మహమ్మద్ ఆస్పత్రిలోనే మృతి చెందాడు. ఆర్టీసీ బస్సులో 16 మంది ప్రయాణికులు ఉండటంతో.. వెనుకవైపు ఎవరూ కూర్చోలేదు. దీంతో అందులోని వారికి ఎవరికీ ప్రమాదం జరగలేదు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించండి

- జేసీ అభిషేక్ కుమార్



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

హిందూపురం టౌన్: పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్నిరకాల మౌలిక సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. మంగళవారం హిందూపురంలోని కొల్లకుంట, కొట్నూరు, మోతుకుపల్లిలోని 15, 16, 17, 18, 124, 125వ పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. కేంద్రాల్లో ఫర్నీచర్, విద్యుత్, ర్యాంప్ సదుపాయం, మరుగుదొడ్లు తదితర వసతులపై ఆరా తీసారు. పోలింగ్ కేంద్రాల్లో చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించారు. కొట్నూరులోని జెడ్పీహెచ్‌ఎస్‌లోని 17వ పోలింగ్ కేంద్రాన్ని మోడల్ పోలింగ్ కేంద్రంగా గుర్తించారు. ఎన్నికల సమయం నాటికి పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. జేసీ వెంట తహశీల్దార్ శివప్రసాదరెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, ఆర్‌ఐ అమరేంద్ర, ఎన్నికల డీటీ రెడ్డిశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సూక్ష్మ సాయం.. మనమే ఘనం!



డ్రిప్ ద్వారా టమాట సాగు

- డ్రిప్, స్ప్రింక్లర్ యూనిట్ల మంజూరులో అగ్రస్థానంలో 'అనంత'
- 6,534 మంది, 7,627 హెక్టార్లతో 'శ్రీ సత్యసాయి'కి ఐదో స్థానం

అనంతపురం అగ్రికల్చర్: బిందు, తుంపర (డ్రిప్, స్ప్రింక్లర్లు) యూనిట్ల మంజూరులో అనంతపురం జిల్లా అగ్రస్థానంలో కొనసాగుతోంది. ప్రస్తుత 2023–24 ఏడాది 12,500 హెక్టార్లకు ఇవ్వాలని టార్గెట్ పెట్టుకోగా... 10,088 మంది రైతులకు 12,375 హెక్టార్లకు ఇచ్చారు. పరికరాలు మంజూరు, ఇన్‌స్టాలేషన్‌లో 26 జిల్లాల కన్నా 'అనంత' మొదటి స్థానంలో నిలిచింది. మన జిల్లా తర్వాత వైఎస్సార్ జిల్లా 10,573 హెక్టార్లు, ప్రకాశం– 9,714 హెక్టార్లు, అన్నమయ్య–7,683 హెక్టార్లకు మంజూరు చేశాయి. ఇక శ్రీ సత్యసాయి జిల్లా 6,534 మంది రైతులు, 7,627 హెక్టార్లతో ఐదో స్థానంలో నిలిచింది.

రూ.146 కోట్లకు పైగా రాయితీ..

ఎన్నికల కోడ్ వెలువడక మునుపే నిర్దేశిత లక్ష్యాన్ని ఏపీఎంఐపీ పూర్తి చేయడంతో రైతులకు ఇబ్బంది లేకుండా పోయింది. ఐదు ఎకరాల్లోపు చిన్న సన్నకారు రైతులకు 90 శాతం, ఆ పైన భూమి కలిగిన రైతులకు 70 శాతం రాయితీతో డ్రిప్ యూనిట్లు ఇస్తున్నారు. ఇక స్ప్రింక్లర్ సెట్లు ఐదు ఎకరాల్లోపున్న రైతులకు 55 శాతం రాయితీ, ఆ పైన 12.50 ఎకరాలున్న రైతులకు 45 శాతం రాయితీ వర్తింపజేయడంతో ఊరట దక్కుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 90 శాతం డ్రిప్ మంజూరు చేయగా, కేవలం 10 శాతం మాత్రమే స్ప్రింక్లర్ యూనిట్లు ఇచ్చారు. ఎస్సీ ఎస్టీ రైతులకు ప్రాధాన్యత ఇస్తూనే మిగతా అన్ని వర్గాలకు సీనియార్టీ వారీగా సకాలంలో పరికరాలు మంజూరు చేశారు. అనంతపురం జిల్లాలో రూ.118 కోట్లకు పైగా విలువ చేసే పరికరాలు ఇవ్వగా శ్రీ సత్యసాయి జిల్లాలో రూ.61 కోట్లు విలువ చేసే డ్రిప్, స్ప్రింక్లర్లు అందించారు. ఇందులో అనంతపురం జిల్లాలో 10,088 మంది రైతులకు రూ.97 కోట్లకు పైగా రాయితీ వర్తించగా, శ్రీ సత్యసాయి జిల్లాలో 6,534 మంది రైతులకు రూ.49 కోట్లకు పైగా రాయితీ వర్తింపజేశారు. ఇలా ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది సూక్ష్మసాగు సేద్య పరికరాలపై ఏకంగా రూ.146 కోట్లకు పైగా రాయితీ వర్తించడం విశేషం. మంజూరు చేసిన రైతులందరి పొలాల్లో త్వరితగతిన పరికరాలు బిగించేలా చర్యలు చేపట్టినట్లు ఏపీఎంఐపీ రెండు జిల్లాల అధికారులు రఘునాథరెడ్డి, సుదర్శన్, ఫిరోజ్‌ఖాన్ తెలిపారు.

యువతి అనుమానాస్పద మృతి

- యువకుడు ఆత్మహత్యాయత్నం



మేఘన మృతదేహం



చికిత్స పొందుతున్న మంజునాథ్

రొళ్ల: కాకి గ్రామంలో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. అదే ఇంటి పైకప్పు మీద నుంచి యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శివన్న, రాధమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు సంతానం. శివన్న ఆరేళ్ల క్రితం చనిపోయారు. కుటుంబ పోషణ నిమిత్తం రాధమ్మ బెంగళూరుకు వలస వెళ్లింది. రెండో కుమార్తె గ్రామంలోనే ఉంటూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తోంది. పెద్ద కుమార్తె మేఘన (20) బెంగళూరులో పీజీ (పేయింగ్ గెస్ట్) రూంలో ఉంటూ డిప్లొమా పూర్తి చేసింది. ప్రస్తుతం ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. మంగళవారం ఉదయాన్నే స్వగ్రామం చేరుకుంది. ఏం జరిగిందో తెలియదు కానీ కొంతసేపటి తర్వాత ఇంట్లో విగతజీవిగా పడి ఉంది. గ్రామానికి చెందిన మంజునాథ్ అనే యువకుడు మేఘనను ఇంట్లోంచి బయటకు తీసుకొచ్చాడు. అసలు ఏం జరిగిందో కుటుంబ సభ్యులకు అర్థం కాలేదు. ఆమె ఎలా చనిపోయింది.. యువకుడు ఇంట్లోంచి ఎందుకు బయటకు తీసుకొచ్చారు అని చర్చించుకోసాగారు. ఇంతలోనే ఇంటి పైకప్పు ఎక్కి మంజునాథ్ కిందకు దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు. తీవ్రంగా గాయపడిన అతడిని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. యువతి మృతి.. యువకుడి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

టీడీపీ ఎన్నికల ప్రచారంలో ఉపాధ్యాయుడు



ప్రచారంలో ఉపాధ్యాయుడు రామాంజనేయులు (వృత్తంలోని వ్యక్తి)

పుట్టపర్తి: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి ఉపాధ్యాయుడు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బుక్కపట్నంకు చెందిన రామాంజనేయులు అలియాస్ రాయుడు పుట్టపర్తి మండలం కంబాలపర్తిలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. మంగళవారం టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి, పల్లె వెంకటకిషోర్‌రెడ్డి బుక్కపట్నం మండలం నార్సింపల్లి తండాలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయుడు రామాంజనేయులు ప్రచారంలో పాల్గొని టీడీపీకి ఓటు వేయాలని అభ్యర్థించడం విమర్శలకు తావిచ్చింది.